క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



కోమటి గుంట గ్రామంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి పూజ చేస్తున్న దృశ్యం

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో కొలువుతీరి ఉన్న శ్రీ వెంకమ్మ మహంకాళి అమ్మ వారు ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం పూజలు నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామ పెద్దలు సంకల్పించారు. దీనిలో భాగంగా వేదమంత్రాలు నడుమ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పానకాల నాగేశ్వరరావు, సత్యవతమ్మ దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు ఇందిరకు డాక్టరేట్



ఇందిర

ఆకివీడు: అధ్యాపక వృత్తిని కొనసాగిస్తూ దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు అవిస ఇందిర ఔషధాల ధ్రువీకరణ అనే అంశంపై పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ ఎస్.వై. శ్రీధర్ పర్యవేక్షణలో లిక్విడ్ క్రోమోటో గ్రాఫిక్ పద్ధతి అభివృద్ధి, ఔషధ మోతాదు రూపాల్లో కొన్ని ఔషధాల ధ్రువీకరణపై ఆమె పరిశోధన చేసినట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పరిశోధనా నివేదికను తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించగా తనకు డాక్టరేట్ పట్టాను అందజేశారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత, అధ్యాపకులు, సిబ్బంది ఆమెను సత్కరించారు.

నిశ్చితార్థం జరగకుండా అసత్యప్రచారం

సాక్షి, భీమవరం: అసత్యప్రచారంతో పెళ్లి నిశ్చితార్థాన్ని జరగకుండా ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భీమవరం పట్టణానికి చెందిన యువతి ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. భీమవరం పట్టణానికి చెందిన యువతికి పాలకొల్లు పట్టణానికి చెందిన యువకుడితో పెళ్లి నిర్ణయించారు. దీనికి గానూ ఈ నెల 9న వీరికి నిశ్చితార్థం జరగాల్సి ఉండగా 8న గుర్తుతెలియని వ్యక్తులు యువకుడి కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్ ద్వారా అసత్య ప్రచారం చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సిద్ధాంతం పిహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.పావని అన్నారు. శుక్రవారం సిద్ధాంతం పీహెచ్‌సీలో ప్రతీ నెలా పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 74 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న మెరుగైన వైద్య పరీక్షలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ బృందేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువు తవ్వకం పనుల ప్రారంభం

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీలోని ఉప్పు చెరువు తవ్వకం పనులను శుక్రవారం సర్పంచ్ బందెల ఏలీషా, ఎంపీడీఓ ఆర్‌సి ఆనంద్ కుమార్‌లు ప్రారంభించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన అమృత్ సరోవర్ పథకంలో గ్రామంలోని ఉప్పు చెరువు తవ్వకం పనులను రూ.3.12లక్షలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో చెరువును తవ్వడంతో పాటు గట్లు వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, స్థానికులకు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా ప్రారంభమైన జాతర ఉత్సవాలు

నరసాపురం: పట్టణంలోని రాయిపేట ప్రసిద్ధ శ్రీ పుంతలో ముసలమ్మ అల్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద చండీహోమం, పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు తరువాత ఈ నెల 30న భారీ అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తమ్మిశెట్టి బాబ్జి, దేవరపు సుబ్బారావు, లింగం రాంబాబు, తాడి రాధాకృష్ణ, పోలిశెట్టి తాతారావు చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగంపై అవగాహన



వెలంపేట కమ్యూనిటీ హాల్లో ఎమ్మెల్సీ ఓటు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు

ఆకివీడు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లకు ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) పిలుపునిచ్చారు. స్థానిక వెలంపేటలోని కమ్యూనిటీ హాలులో శుక్రవారం స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాజు మాట్లాడుతూ రవీంద్రనాథ్‌కు 1వ ప్రాధాన్యత ఓటు, కవురు శ్రీనివాస్‌కు రెండో ప్రాధాన్యత ఓటును వేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఇచ్చే స్కెచ్ పెన్‌తో మొదటి గడిలో 2, రెండో గడిలో 1 అంకెలను మాత్రమే వేయాలని సూచించారు. బ్యాలెట్ పత్రంపై ఎలాంటి గుర్తులు, అక్షరాలు రాయకూడదన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు తమ ఓటును ప్రాధాన్యతా క్రమంలో అంకెలు వేసి వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థుల్ని గెలిపించాలని సూచించారు. సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇద్దరూ వినయ విధేయత, విజ్ఞత కలిగిన వ్యక్తులన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం ఏకగ్రీవమేనని, ప్రతిపక్షాల కుట్రతో స్వతంత్ర అభ్యర్థుల్ని రంగంలో దింపి ఎన్నికలకు అవకాశం కల్పించారన్నారు. ఎన్ని కుతంత్రాలు జరిగినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తామని ధీమా వ్యక్తం చేరు. అనంతరం మాక్ పోలింగ్ నిర్వహించి ఓటు వేసే విధానాన్ని తెలియజేశారు. ఈ నెల 13 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే పోలింగ్‌కు ప్రజాప్రతినిధులైన ఓటర్లు ముందుగానే ఓటు వేసేందుకు వెళ్లాలని త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ సూచించారు. భీమవరంలో జరిగే కార్యక్రమంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, కేశిరెడ్డి మురళీ, జగ్గరోతు విజయ్‌కుమార్, జీ.ధనరాజు, దాసరి సనాతన, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి



ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మందులను అందిస్తున్న దృశ్యం



పాలకోడేరులో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

కాళ్ల: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 1–19 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలందరూ ఈ నెల 14న నులిపురుగుల మందులు వేసుకోవాలని సూచించారు. తద్వారా నులిపురుగుల నివారణ సాధ్యపడుతుందని తెలిపారు. నూరు శాతం అర్హులకు మందులు చేరేలా వైద్యులు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గులాబ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన నిర్వహించే నులిపురుగుల మాత్రల పంపిణీ పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్ హుస్సేన్, పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల మాత్రల పంపిణీపై మండల టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ రంగం నాయుడు అధ్యక్షతన సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన చిన్నారుల నుంచి హైస్కూలు, కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. ఈ మాత్రల వల్ల ఉపయోగాలను ఈ మాత్రలు వేసుకోకపోతే వచ్చే అనర్థాలను వివరించాలన్నారు. ఈ మాత్రలు వేసేముందు హ్యాండ్ వాష్ గురించి తెలియజేయలన్నారు. ఎంపీడీఓ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే ర్యాలీలు



వీరవాసరంలో డ్రైడే అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



గొరగనమూడిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీరవాసరం: వీరవాసరం గ్రామంలో చిన్న పేట, గోగులమ్మ పేట ఏరియాల్లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కె.భాస్కరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. నివారణ చర్యలు గురించి తెలియజేస్తూ పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న యాంటీ లార్వల్ మెజర్స్, ఫాగింగ్ గురించి నీటి నిల్వలు, శానిటేషన్ గురించి పంచాయతీ వారికి సూచించారు. ఇక్కడ సిబ్బంది చేసే పనిపై సంతృప్తి వ్యక్తపరిచి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవదాసు గారు, సూపర్వైజర్ జీవివి సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వై మోహన్ రావు, ఏఎస్ఎం భవాని పాల్గొన్నారు.

గొరగనమూడిలో..

పాలకోడేరు: జ్వరాలను నియంత్రించాలంటే దోమల నివారణ తో పాటు, పరిసరాల పరిశుభ్రతను పరిరక్షించు కోవాలని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగం నాయుడు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని గొరగనమూడి, పాలకోడేరు, విస్సాకోడేరు, పెన్నాడ, మోగల్లు తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు ఆదేశాలతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి గ్రామాల పంచాయతీ సిబ్బందికి తెలియపరచడమే కాకుండా బ్లీచింగ్ చల్లించారు. అదే విధంగా ఆయా ప్రాంతాల ప్రజలకు దోమల నివారణ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్, నాగమణి, అమ్మాజీ, చండీరాణి తదితరులు పాల్గొన్నారు

యూత్ హాస్టల్స్ సభ్యత్వం ద్వారా సదుపాయాలు



వైహెచ్‌ఏఐ ఇన్‌స్టిట్యూషనల్ సభ్యత్వ సర్టిఫికెట్‌ను అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: యూత్ హాస్టల్స్ సభ్యత్వం ద్వారా వివిధ ప్రాంతాల్లో అనేక సదుపాయాలు పొందే అవకాశం ఉందని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కర్సాపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. శుక్రవారం యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్‌ఏఐ) ఇన్స్టిట్యూషనల్ సభ్యత్వాన్ని అసోసియేషన్ భీమవరం డిస్ట్రిక్ యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ డీఎన్నార్ కళాశాలకు సభ్యత్వ సర్టిఫికెట్స్‌ను అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైహెచ్‌ఏఐ సభ్యత్వం పొందితే విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలకు వైహెచ్‌ఏఐ అనేక సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, కళాశాల సహాయకార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, తాళ్లపూడి గాంధీ, అబపాల రామ్మూర్తి, బోణం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలి



నన్నేటి నాగరాజుకు నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రైవేట్ రంగంలో ఎస్సీ.ఎస్టీలకు రిజర్వేషన్ ప్రాతిపదికపై ఉద్యోగావకాశాలు, పదోన్నతులు కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరంలో నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ రంగంలో పని చేసే ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని రిజర్వేషన్ పద్ధతిపై వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నన్నేటి నాగరాజును నియమిస్తూ నియామకపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నేతల సాల్మన్‌రాజు, నేతల సువర్ణ రాజు, పిట్టా వినోద్ కుమార్, గొర్ల గోపి, దాసరి చిరంజీవి, పెనుమాల చందుబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ గ్రామోత్సవం



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఉగాది సందర్భంగా అడవిపాలెం గ్రామంలో నిర్వహించే గ్రామదేవత కనకదుర్గమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఘటాలను తలపై ఎత్తుకుని మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. తమ ఇళ్లకు వచ్చిన ఘటాలకు భక్తులు అమ్మవారి పాదాలు పసుపు నీళ్లతో కడిగి, కొబ్బరికాయలు, అరటిపళ్లు నైవేద్యం సమర్పించి కర్పూరంతో హారతులిచ్చారు. ఉత్సవాలలో భాగంగా ఉగాది ముందు రోజు మార్చి 21న గ్రామానికి తూర్పు వైపున జాతర మార్చి 22న ఉగాది రోజు గ్రామానికి పడమర వైపు జాతర నిర్వహించి మార్చి 23న ఊయల సేవతో అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని మెట్టినింటి వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని గాంధీ అమ్మవారి పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్తలు పొట్టుపోతు నాగలక్ష్మణ శ్రీనివాసరావు, అడబాల రాజేష్ తెలిపారు.

శ్రీవారి నిధులతో రాములోరి గుడుల నిర్మాణం



పెదకాపవరంలో రామాలయం అభివృద్ధి కోసం వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: రాములోరి గుడులు అభివృద్ధికి, పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవారి నిధులు రూ.10 లక్షలు కేటాయిస్తున్నారని దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వీ.వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని కోదండ రామాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లోని శ్రీరామచంద్రమూర్తి ఆలయాలకు నిధుల కోసం గ్రామస్తులు విజ్ఞప్తులు చేశారని చెప్పారు. ప్రతిపాదనల్ని టీటీడీకి పంపుతామని చెప్పారు. గతంలో మండలంలోని గుమ్ములూరుతో పాటు ఇతర మండలాల్లో వచ్చిన ప్రతిపాదనలు పంపగా రూ. 10 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలు వచ్చాయన్నారు. త్వరలోనే ఈ దేవాలయాలకు కూడా నిధులు వస్తాయని చెప్పారు. కోదండ రామాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ కఠారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. టీటీడీ నిధులు కూడా వస్తే ఆలయం మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు, కఠారి రామకృష్ణ(రాము), రెడ్డియ్య, విశ్వనాథం, ఆలయాల మేనేజర్ రంగరాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న భూహక్కు సర్వే



పెదకాపవరం గ్రామంలో డ్రోన్ సర్వేని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆకివీడు: జగనన్న భూహక్కు–రక్షణ పథకంలో భాగంగా భూముల రీ సర్వే పారదర్శకంగా జరుగుతుందని ఎంపీపీ కఠారి జయలక్ష్మీ చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో డ్రోన్ సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలం వాయిదా పడిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునః ప్రారంభించడం అభినందనీయమన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రీ సర్వే వేంగవంతంగా జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయ్యిందన్నారు. రికార్డుల ప్రకారం రీ సర్వేను రెవిన్యూ అధికారులు వేగవంతం చేశారని చెప్పారు. గ్రామంలో 4,500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములను సర్వే చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి రామకృష్ణ (రాము), కేశవరావు, పాతపాటి శ్రీనివాసరాజు, ఆదాం, కట్రెడ్డి వెంకన్న(చంటి), వీఆర్వో బొల్లెంపల్లి ప్రసాద్, కార్యదర్శి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన అవసరం



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు

ఉండి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే జీవితంలో ఎదురైయ్యే ప్రతీ సమస్యను ధైర్యంగా ఎదుర్కోవచ్చని న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదులు పీ రాధ, ఎం దివ్యశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉండి మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శేషవేణి అధ్యక్షతన భీమవరం మండల న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదులు డ్వాక్రా మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మహిళలు విద్య, క్రీడలు,ఉద్యోగం,రాజకీయం తదితర రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. అన్నారు.అందుకే మహిళలు వెనుకంజ వేయకుండా ముందుకు దూసుకుపోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలంటే మహిళా చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, మనోవర్తి, ఉమ్మడి కుటుంబం తదితర చట్టాలను తెలుసుకోవాలన్నారు. 2005లో ఏర్పాటైన ఆస్తిలో వారసత్వపు సమానత్వ హక్కు చట్టం తెలుసుకుని లబ్ధి పొందాలన్నారు. చిన్న పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు స్త్రీ మూర్తులు చైతన్యవంతులు కావాలన్నారు.ఏదైనా మానసిక ఒత్తిడి, లేదా అవమాన భారం, ఎవ రివల్లనైనా ఇబ్బంది కలుగుతుంటే మనస్థాపానికి గురై ఆత్మహత్య వంటి పిరికి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, సమాన పనికి సమాన వేతనం తదితర చట్టాలను తెలుసుకోవాలన్నారు. అలాగే కుటుంబ జీవనంలో మహిళ ఎంత మంది పిల్లల్ని కనాలి? అనేది మహిళకు ఉన్న హక్కు అని గమనించాలన్నారు. మహిళా చట్టాలపై ఎప్పుడైతే అవగాహన కలిగి ఉంటారో? అప్పుడు సమాజంలో ఎలాంటి భయాలు లేకుండా ముందుజ వేసి అభివృద్ధి చెందుతారని న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళల మండలాధ్యక్షురాలు కుమారి, ఇతర డ్వాక్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, ఎస్ఎల్‌జీ ప్రతినిధి వై.రణదివె, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి. రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌లోని మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎస్ఎల్‌జీ (శ్రీ లక్ష్మి గాయత్రి)హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.సుధీర్ రోగులను పరీక్షించి, వైద్య సేవలు అందిస్తారన్నారు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదు కోసం 63001 80993, 91333 39500కు ఫోన్ చేయాలని సూచించారు.

నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు



తుందుర్రు గ్రామంలో లేగదూడల ప్రదర్శన

భీమవరం అర్బన్: నేటి లేగదూడలే రేపటి పాడి పశువులని, వాటి పెంపకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ డాక్టర్ జి.ఏసురత్నం సూచించారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామ పశు వైద్యశాలలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ డాక్టర్ జి.ఏసురత్నం మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తోందని తెలిపారు. గతంలో గేదెలను దున్నపోతు వద్ద తోలి సాధారణ పద్ధతి ద్వారా గర్భధారణ జరిపించేవారని, ఇప్పుడు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యిలు మాత్రమే జన్మిస్తున్నాయని వివరించారు. ఈ విధానం ద్వారా పుట్టే లేగదూడలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా నాణ్యమైన బ్రీడ్ కలిగి ఉంటాయని చెప్పారు. అనంతరం లేగదూడల పోషణ, వ్యాధుల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పశు సంవర్ధక శాఖ భీమవరం డివిజన్ డీడీ డాక్టర్ జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ లేగ దూడల ప్రదర్శనలో 68 దూడలు పాల్గొన్నాయన్నారు. వాటిలో వివిధ కేటగిరీల కింద ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు దూడలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీ పి.సుధీర్‌బాబు, మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు, సర్పంచ్ ఆరేటి వీరాస్వామినాయుడు, రైతులు, పశు పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు తక్షణం చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ తెలిపారు. పన్ను బకాయిలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిదారుల కుళాయి కనెక్షన్లు తొలగించడానికి వార్డుల వారీగా టీములు కూడా ఏర్పాటు చేశామన్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం సెలవు దినాలైన శనివారం, ఆదివారం కూడా మునిసిపల్ కార్యాలయం, సచివాలయంలో కూడా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ డ్రైయిన్ నిర్మాణ పనుల పరిశీలన



సీసీ డ్రైయిన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శుక్రవారం పట్టణంలోని 10వ వార్డులో14వ ఆర్థిక సంఘం నిధులు రూ 13.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. పట్టణంలో అభివృద్ధి పనులకు 14వ ఆర్థిక సంఘం నిధులతో పాటుగా జనరల్ ఫండ్స్ పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు.ఆమె వెంట కౌన్సిలర్ చిట్టూరి కృష్ణ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.